సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు



సోమశిలలో 25.173 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 25.173 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాకు 1,850 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్ల (10 గ్రాములు)	రూ.65,050
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,842
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,017
నవర (8 గ్రాములు)	రూ.48,136

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 33.0 /25.0

శుక్రవారం గాలిలో తేమ 74 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతున్నాయి. శనివారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన ఎండీ ఖలీల్



నెల్లూరు(సెంట్రల్): వైఎస్సార్‌సీపీ నెల్లూరు నగర ఎమ్మెల్యే అభ్యర్థిగా డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఆయన సిటీ ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌తో కలిసి శుక్రవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఖలీల్ ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఎంపీ ఆదాల అభినందనలు

నెల్లూరు రూరల్ : వైఎస్సార్‌సీపీ నెల్లూరు నగర ఎమ్మెల్యే అభ్యర్థిగా డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్‌ను పార్టీ కేంద్ర కార్యాలయం ఎంపిక చేయడం అభినందనీయమని ఎంపీ, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీలపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎంతో గౌరవం ఉందని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

92.33 శాతం మందికి పింఛన్ల పంపిణీ



కొండాయపాళెం గేటు సెంటర్‌లో ప్రమీలమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మధు

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక నగదు పంపిణీ ప్రక్రియ జిల్లావ్యాప్తంగా కొనసాగుతోంది. రెండో రోజు శుక్రవారం వలంటీర్లు 92.33 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేశారు. జిల్లాలో 3,18,953 మంది లబ్ధిదారులకు పింఛన్ కానుక అందజేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 2,94,510 మందికి పంపిణీ చేశారు. ఈ నెల 5వ తేదీ వరకు పింఛన్లు పంపిణీ చేయనున్నారు.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవకాశం



మాట్లాడుతున్న ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయరత్నం

నెల్లూరు(మినీబైపాస్): ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల కోసం ఎంఎస్‌ఎంఈ అవుట్‌రీచ్ కార్యక్రమాన్ని, ఏపీఐఐసీ పార్కుల్లో పరిశ్రమలు స్థాపించే వారికి ఆర్థికసాయం అందించే కార్యక్రమాన్ని నెల్లూరులోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఐఐసీ జోనల్ మేనేజర్ విజయరత్నం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ జోగారావు మాట్లాడుతూ పాత లీజు విధానానికి స్వస్తి చెప్పి కొత్తగా అవుట్రైట్ సేల్ బేసిస్, ఓఆర్‌ఎస్ బేసిస్‌లో ప్లాట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ పారిశ్రామికంగా ఎదగాలని, యూనియన్ బ్యాంక్ వారికి తోడుగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎస్‌ఎఫ్‌సీ మేనేజర్ నాగశేఖర్ పాల్గొన్నారు.

డీఏ విడుదలపై హర్షం

నెల్లూరు(దర్గామిట్ట): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిరుద్యోగులకు రూ.500 డీఏ ప్రకటించడంపై ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని ఏపీ జీఈఎఫ్ జిల్లా చైర్మన్ చేజర్ల సుధాకర్‌రావు, జనరల్ సెక్రటరీ దేవిరెడ్డి రమణారెడ్డి, సచివాలయ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లి హరీష్‌రెడ్డి అన్నారు. వీఆర్‌ఏల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో జీఓ నంబర్ 40 విడుదల చేశారని తెలిపారు. స్పందించిన ముఖ్యమంత్రికి, ఏపీ జీఈఎఫ్ చైర్మన్ కాకార్ల వెంకటరామిరెడ్డి, రాష్ట్ర జనరల్ సెక్రటరీ అరవ పాల్, వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మర్రి వెంకటేశ్వర్లుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

గోరుముద్ద.. భలే రుచిలే

ఒకప్పుడు పురుగుల అన్నం.. నీళ్ల సాంబారు.. ఇదే మధ్యాహ్న భోజన పథకం మెనూ. విద్యార్థులు ముద్ద మింగలేక.. ఆకలితో కడుపు మాడ్చుకునేవారు. నిర్వాహకులను ప్రశ్నించలేక మిన్నకుండిపోయేవారు. కన్నీళ్లతో కడుపు నింపుకునేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారింది. చక్కని మెనూ అమలు చేస్తూ రకరకాల రుచికరమైన పదార్థాలు వడ్డిస్తుండడంతో ఇష్టంగా తిని చక్కగా చదువుకుంటున్నారు.



వింజమూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు (ఫైల్)



పక్కాగా అమలవుతున్న 'జగనన్న గోరుముద్ద'

- మారిన మెనూతో ఆనందంగా తింటున్న విద్యార్థులు
- ప్రతి రోజూ పర్యవేక్షిస్తున్న అధికారులు, తల్లిదండ్రులు

ఉదయగిరి : అన్నం పరబ్రహ్మ స్వరూపం. అందులోనూ చిన్నారులు తినే ఆహారం వారి ఎదుగుదలతోపాటు బంగారు భవిష్యత్‌ను నిర్ణయిస్తుంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసే మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించి విద్యార్థుల ఆకలి కేకలకు కారణమైంది. అప్పట్లో పురుగుల అన్నం, చిమిడిన భోజనం, నీళ్ల సాంబారు, చారు వడ్డించేవారు. దీంతో విద్యార్థులు వాటిని తినలేకపోయేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పరిస్థితులను గమనించి భావిభారత పౌరుల ఆకలి కష్టాలను తీర్చింది. మధ్యాహ్న భోజన పథకం అమలులో పెనుమార్పులు తీసుకువచ్చింది. 'జగనన్న గోరుముద్ద పథకం' పేరుతో ప్రతి రోజూ గుడ్డు (శనివారం మినహా), ప్రత్యేక మెనూతో శుచి, శుభ్రత, నాణ్యతకు పెద్దపీట వేసింది. దీంతో నాడు అన్నం తినలేక బయట పారేసిన విద్యార్థులే ఇప్పుడు ఒక్క మెతుకు కూడా వదలకుండా తింటున్నారంటే ఎంత మార్పు వచ్చిందో అర్థం చేసుకోవచ్చు.

ఆరోగ్యానికి ప్రాధాన్యం

డ్రాపౌట్ల నివారణతోపాటు విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో సర్కారు బడుల్లో ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన వెంటనే విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేలా చర్యలు తీసుకున్నారు. విద్యార్థుల ఎదుగుదలకు పోషకాలతో కూడిన నూతన మెనూ అమలు చేస్తున్నారు. మధ్యాహ్న భోజనంలో వారంలో ఐదు రోజులు కోడిగుడ్డు అందిస్తున్నారు. వీటితోపాటు వారానికి మూడు రోజులు రాగిజావ ఇస్తున్నారు. దీంతో పాఠశాలలకు వచ్చే విద్యార్థుల సంఖ్య కూడా పెరిగిందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

పక్కగా అమలు

'జగనన్న గోరుముద్ద' పథకం అమలు బాధ్యతను ప్రభుత్వం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అప్పగించింది. వీరితోపాటు విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, గ్రామ కమిటీ ప్రతినిధులు కూడా ప్రతి రోజూ ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలిస్తున్నారు. ఆ తర్వాతే విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్నారు. ఎంఈఓలు కూడా ప్రతి రోజూ ఏదో ఒక పాఠశాలను తనిఖీ చేస్తున్నారు. దీంతో నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందుతుండడంతో ఇష్టంగా తింటూ చక్కగా చదువుకుంటున్నారు.

జిల్లాలో..

మొత్తం ప్రభుత్వ పాఠశాలలు	విద్యార్థులు
3,433	3,52,460



మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు

మెనూ ఇలా..

రోజు	మెనూ
సోమవారం :	హాట్‌పొంగల్, ఉడికించిన గుడ్డు, వెజిటబుల్ పలావ్, కోడిగుడ్డు కూర, చిక్కీ
మంగళవారం :	చింతపండు/నిమ్మకాయ పులిహోరా, టమాటా/దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు, రాగిజావ
బుధవారం :	వెజిటబుల్ బిరియాని, ఆలూ కుర్మా, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ
గురువారం :	నిమ్మకాయ పులిహోరా, టమాటా పచ్చడి, ఉడికించిన గుడ్డు, రాగిజావ
శుక్రవారం :	అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ
శనివారం :	ఆకుకూర అన్నం, పప్పుచారు, స్వీట్ పొంగల్, రాగిజావ

కడుపునిండా భోజనం



మా పాఠశాలలో అందిస్తున్న భోజనం చాలా బాగుంది. రోజుకో మెనూతో భోజనం పెడుతున్నారు. రోజూ చిక్కీ, కోడిగుడ్డు ఇస్తున్నారు. దీంతో ప్రతి రోజూ మంచి భోజనం కడుపు నిండా తింటున్నాం. బాగా చదువుకుంటున్నాం.

– గోవర్ధన్, విద్యార్థి, జెడ్పీహెచ్‌ఎస్, వింజమూరు

పిల్లలందరూ తింటున్నారు



గతంలో బడికి వచ్చిన పిల్లల్లో 60 శాతం మంది మాత్రమే మధ్యాహ్న భోజనం తినేవారు. ఇప్పుడు మెనూ మారడం.. భోజనం చాలా బాగుండడంతో పిల్లలందరూ పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం తింటున్నారు. ప్రస్తుతం అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో పోషక విలువలు ఎక్కువగా ఉండడంతో పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదల కనిపిస్తోంది.

– మాలకొండయ్య, హెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్, వింజమూరు

నాణ్యతలో రాజీలేకుండా అమలు

ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకాన్ని పక్కాగా అమలు చేస్తున్నాం. అన్ని మండలాల్లో ప్రతిరోజూ ఎంఈఓలు, డిప్యూటీ ఈఓలు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, సచివాలయ సిబ్బంది ఈ పథకం అమలును పర్యవేక్షిస్తున్నారు. నాణ్యతతో రాజీలేకుండా మెనూ అమలు చేస్తున్నాం.

– గంగభవాని, డీఈఓ, నెల్లూరు

16న 'జగనన్న చేయూత' అందజేత



ముత్తుకూరులో ఫిష్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 16వ తేదీన జగనన్న చేయూత పథకం నాలుగో విడత నిధులు రూ.18,750 చొప్పున లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ముత్తుకూరులో శుక్రవారం నూతన సచివాలయ భవనం, ఫిష్ మార్కెట్, ముస్లింల స్మశాన వాటిక ప్రహరీతోపాటు రూ.2.12 కోట్ల విలువైన అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. 41 మంది పేదలకు ఇంటి నివేశన స్థలాల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ గతంలో చాలా గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలే లేవని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి పాలనను ప్రజల ముంగిటకే తీసుకువచ్చామన్నారు. గత టీడీపీ పాలనలో పింఛన్ల మంజూరుపై జన్మభూమి కమిటీల పెత్తనం కొనసాగిందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక సచివాలయాల ద్వారా వలంటీర్లే నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు అందజేస్తున్నారని తెలిపారు. తద్వారా లబ్ధిదారుల ఇబ్బందులు తొలగాయన్నారు. ముత్తుకూరు మండలంలో బియ్యం రేషన్ కార్డులు కలిగిన 16,231 కుటుంబాలకు నాన్ ఫిషర్ మెన్ ప్యాకేజీ పంపిణీ చేశామని, మిగిలిన వారికి కూడా ప్యాకేజీ పంపిణీ చేస్తామని మంత్రి తెలిపారు.

రూ.33 కోట్లతో అభివృద్ధి పనులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ముత్తుకూరు పంచాయతీలో రూ.33.65 కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరిగాయని మంత్రి కాకాణి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, సర్పంచ్ బూదూరు లక్ష్మి, మండల ఉపాధ్యక్షులు విజయలక్ష్మి, నాయకులు మునుకూరు రవికుమార్‌రెడ్డి, ఈదూరు రామమోహన్‌రెడ్డి, దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, కె.లక్ష్మణరెడ్డి, నడవడి ముత్యంగౌడ్, షేక్ రహీమ్‌సాహెబ్, ఎంపీటీసీ సభ్యుడు షేక్ నవీద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



పుష్పాలంకరణలో స్వామి, అమ్మవార్లు



పుష్పయాగంలో కుటుంబ సభ్యులతో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

శాస్త్రోక్తంగా పుష్పయాగం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలో వెలసిన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయంలో శుక్రవారం పుష్పయాగం వైభవంగా జరిగింది. వేద మంత్రాల నడుమ జరిగిన ఈ కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ లక్ష్మీసుబ్రహ్మణ్యంనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 11 రకాల పుష్పాలతో యాగం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అంతకుముందు ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో నిర్మించిన అన్నదాన సత్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి భక్తులు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, నల్లపరెడ్డి రజిత్‌కుమార్‌రెడ్డి, మోర్ల సుప్రజ, పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, ఈఓ గిరికృష్ణ, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పు రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

- డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ సాంబశివారెడ్డి

అల్లూరు: తీర ప్రాంతంలో ఉప్పు సాగుపై ఆధార పడిన రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ సాంబశివారెడ్డి తెలిపారు. మండలంలోని ఇస్కపల్లి పంచాయతీ పరిధిలోని ఉప్పు రైతులతో శుక్రవారం అధికారులు సమీక్షించారు. ప్రధానంగా ఉప్పు కయ్యలు వరదలకు కోతకు గురికాకుండా కరకట్టలు నిర్మించాలని కోరారు. ఉప్పు రైతులకు బోర్లు, ఉప్పు నిల్వలకు షెడ్డులను, ప్లాట్‌ఫాంను, మంచి నీటి వసతిని ఏర్పాటు చేయమని కోరారు. ఉప్పు సాగు చేసుకోవడానికి రుణాలను మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాబార్డు డీడీఎం రవి సింగ్, ఎల్‌డీఎం శ్రీకాంత్, డీపీఎం భానుప్రసాద్, ఏపీఎం ప్రసాద్‌రావు, ఎంపీడీఓ జ్యోతి, ఎంపీపీ శశిరేఖ, సర్పంచ్ రంజిత్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బీద రమేష్‌బాబు, స్థానిక నేత కొండూరు శ్రీను, ఉప్పు రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి

టీడీపీని భూస్థాపితం చేస్తారా

- మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు
- ఆత్మకూరులో పర్యటించిన నారా భువనేశ్వరి
- ఫ్లెక్సీల్లో తన ఫొటో వేయకపోవడంపై కొమ్మి ఆగ్రహం

ఆత్మకూరు: నలుగురు వ్యక్తులు, నాలుగు నెలలుగా టీడీపీని పాడెపై పండబెట్టి మోస్తున్నారని, 40 ఏళ్ల తెలుగుదేశం పార్టీని భూస్థాపితం చేస్తారా అంటూ మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు స్థానిక టీడీపీ నేతలను ప్రశ్నించారు. టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 22వ వార్డు అల్లీపురంలో 'నిజం గెలవాలి' కార్యక్రమం జరిగింది. భువనేశ్వరి ప్రకటించిన షెడ్యూల్ కన్నా ముందుగానే.. ఇటీవల మృతిచెందిన టీడీపీ కార్యకర్త కముజుల ఆంజనేయరెడ్డి ఇంటికి చేరుకున్నారు. ఈ కార్యక్రమం కోసం తెలుగు తమ్ముళ్లు రహదారి వెంట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో కేవలం ఆనం రామనారాయణరెడ్డి ఫొటోలు, స్థానిక టీడీపీ నాయకుల ఫొటోలు మాత్రమే ఉండడంతో దీనిపై మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు మండిపడ్డారు. తనతో పాటు మరో మాజీ ఎమ్మెల్యే బొల్లినేని కృష్ణయ్య, పార్టీ అధికార ప్రతినిధి గూటూరు మురళీ కన్నబాబు ఫొటోలు, పేర్లు లేకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో అక్కడే ఉన్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టి.చంద్రారెడ్డి, కౌన్సిలర్ మాదాల శ్రీనివాసులునాయుడు, మహిళా నాయకురాలు పులిమి శైలజారెడ్డి, వెంకటేశ్వర్లునాయుడు తదితరులను నిలదీశారు.



మాజీ ఎమ్మెల్యే కొమ్మిని, చంద్రారెడ్డిని అడ్డుకుంటున్న యువగళం టీం

ఆనంను అభ్యర్థిగా ప్రకటించారా ?

ఆనంను అధిష్టానం ఆత్మకూరు అభ్యర్థిగా ప్రకటించిందా.. మీకేమైనా అలాంటి సమాచారం ఎవరైనా చెప్పారా.. ఎందుకు ఆయన ఫొటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారంటూ స్థానిక టీడీపీ నేతలను కొమ్మి ప్రశ్నించారు. దీంతో వారు అక్కడి నుంచి మౌనంగా పక్కకు తప్పుకున్నారు. కనీసం సీనియర్ నాయకులను, మాజీ ఎమ్మెల్యేలను పట్టించుకొనే పరిస్థితి లేకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం భువనేశ్వరి పరామర్శించేందుకు వెళ్లిన ఇంట్లోకి కొమ్మి లక్ష్మయ్యనాయుడుతోపాటు మరో నాయకుడు చంద్రారెడ్డి వెళ్లబోతుండగా, యువగళం పాదయాత్ర టీము వారిని అడ్డుకున్నారు. దీంతో కొమ్మి తాను మాజీ ఎమ్మెల్యేనని, ఎవరు చెబితే మీరు నన్ను అనుమతించడం లేదంటూ నిలదీశారు. దీంతో వారు ఆయనను లోపలికి అనుమతించారు. అయితే చంద్రారెడ్డిని మాత్రం అనుమతించక పోవడంతో ఆయన వారితో వాగ్వాదానికి దిగారు. దీంతో చంద్రారెడ్డిని కూడా ఇంట్లోకి వెళ్లేందుకు అనుమతించారు.

త్వరలో వీఎస్‌యూ స్నాతకోత్సవం

వెంకటాచలం : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం 8, 9 స్నాతకోత్సవం మార్చి/ఏప్రిల్ నెలలో నిర్వహించేందుకు విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఎస్‌యూ పరిధిలోని అన్ని డిగ్రీ, పీజీ కళాశాలల్లో 2021, 2022 సంవత్సరాలు, అంతకు పూర్వం డిగ్రీ, పీజీ పూర్తి చేసిన విద్యార్థులు మార్చి ఒకటో తేదీ లోపు www.vsu.ac.in వెబ్‌సైట్‌లో పట్టా కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునే విధానం, ఇతర వివరాలకు సంబంధిత కళాశాలల ప్రిన్సిపల్స్‌ను సంప్రదించాలని తెలిపారు.

జొన్నవాడలో బహిరంగ వేలం పాటలు

- ఆలయానికి రూ.80,83,116 రాబడి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో శుక్రవారం 2024–2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ వస్తువుల సరఫరాకు బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. వేలం పాటల ద్వారా ఆలయానికి రూ.80,83,116 రాబడి సమకూరినట్లు ఆలయ చైర్మన్ లక్ష్మీసుబ్రహ్మణ్యం నాయుడు, ఈఓ గిరికృష్ణ తెలిపారు.

క్లుప్తంగా

నియామక పత్రాల అందజేత



నియామక పత్రాలను అందుకున్న వారితో రామ్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు(సెంట్రల్): రాపూరు మండల పరిధిలో అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు ఎంపికైన వారికి నియామక పత్రాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి, పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నెల్లూరులో శుక్రవారం అందజేశారు. రాపూరు, కలువాయి పరిధిలోని సిద్ధవరం, చవటపల్లి ప్రాంతాలకు సంబంధించిన వారికి నియామక ఉత్తర్వులను అందజేశామని ఆయన తెలిపారు.

రేపట్నుంచి కర్రసాము పోటీలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని చిల్డ్రన్స్ పార్కులో సౌత్ జోన్ కర్రసాము పోటీలను చిల్డ్రన్స్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి నిర్వహించనున్నామని నిర్వాహకుడు శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు పార్కులో విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి కర్రసాము క్రీడాకారులు పాల్గొననున్నారని తెలిపారు. ఒంటి కర్ర, రెండు కర్రలు, పిడికిలి కర్ర తదితర విభాగాల్లో పోటీలను నిర్వహించనున్నామని వెల్లడించారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శింగంశెట్టి మురళి, రవి, కొట్టే రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలన



పరిశీలిస్తున్న ఆదర్శ్ రాజేంద్రన్

నెల్లూరు(దర్గామిట్ట): నెల్లూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న పేదల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ శుక్రవారం పరిశీలించారు. ఆన్‌లైన్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియపై పలు సూచనలు చేశారు. పేదలకు ప్రభుత్వం అందజేస్తున్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఆర్డీఓ మలోల తదితరులు పాల్గొన్నారు.

కాజ్‌వే నిర్మాణానికి శ్రీకారం సంతోషకరం



పనులను ప్రారంభిస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

- వైఎస్సార్ కాజ్‌వేగా నామకరణం
- ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: మండలంలోని ముదివర్తిపాళెం.. విడవలూరు మండలంలోని ముదివర్తి గ్రామాల మధ్య పెన్నాపై సబ్ మెర్సిబుల్ కాజ్‌వే నిర్మాణం దశాబ్దాల కల అని, ఈ పనులను తన చేతుల మీదుగా ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పనులను ముదివర్తిపాళెంలో శుక్రవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఫేజ్ – 1 కింద రూ.93.32 కోట్లను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారని, సుమారు 1050 మీటర్ల నిర్మాణాన్ని చేపట్టనున్నారని చెప్పారు. మిగిలిన 360 మీటర్ల మేర అప్రోచ్ రోడ్డు, ఫ్లడ్ బ్యాంక్ నిర్మాణాన్ని చేపట్టాల్సి ఉందన్నారు. దీని కోసం రూ.130 కోట్లతో అంచనాలను ప్రభుత్వానికి పంపామని వెల్లడించారు. ఫేజ్ – 2 కింద వీటికి అనుమతులను మంజూరు చేయించి పూర్తి చేస్తామని ప్రకటించారు. దాదాపు 1400 స్టీల్ జెడ్ షీట్ పైల్స్‌ను ఏర్పాటు చేయాల్సి ఉందని, వీటిని రాయ్‌చూర్ నుంచి తెప్పిస్తామన్నారు. ఈ నిధులు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించినవని, అయితే ఇవేవీ తెలియని టీడీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి వారు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయడం సిగ్గుచేటని పరోక్షంగా పోలంరెడ్డి దినేష్‌రెడ్డిని దుయ్యబట్టారు. వైఎస్ రాజశేఖరరెడ్డి కాజ్‌వేగా నామకరణం చేస్తున్నామని,ఈ ప్రతిపాదనలను సంబంధిత శాఖ ద్వారా ప్రభుత్వానికి పంపనున్నామన్నారు. ఇరిగేషన్ ఎస్‌ఈ కృష్ణమోహన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోవూరు నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీఎల్డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, డైరెక్టర్ గునుపాటి సురేష్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ జయలక్ష్మి, బట్టేపాటి నరేంద్రరెడ్డి, ఇరిగేషన్ ఈఈ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

ఎవరు కావాలో ఒక్కసారి ఆలోచించండి

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఎనిమిది నెలల వ్యవధిలో రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు చేసిన వారు కావాలా.. లేక నాలుగున్నరేళ్ల అరాచకాలు, అవినీతి, అక్రమాలు సాగించిన వారు కావాలో ప్రజలు ఒక్కసారి ఆలోచించి.. రానున్న ఎన్నికల్లో తీర్పునివ్వాలని ఎంపీ, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 23వ డివిజన్లో గల బాబూ జగ్జీవన్‌రామ్ కాలనీలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలను శుక్రవారం నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ ప్రాంత అభివృద్ధికి రూ.కోటిని మంజూరు చేశామని.. రూ.9.7 కోట్లతో డివిజన్ పరిధిలోని ప్రాంతాలను పూర్తిగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. పేద, మధ్య తరగతి వర్గాల అభ్యున్నతే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్న తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ శ్రీనివాసులురెడ్డి తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఫాగింగ్ మెషీన్‌ను ఎంపీ ప్రారంభించారు. మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు పుల్లారెడ్డి, బెల్లంకొండ వెంకయ్య, రైల్వే బోర్డు సభ్యుడు స్వర్ణా వెంకయ్య, హరిబాబుయాదవ్, మర్రిపాడు జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, ఏసునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి



యోగా గురువు, హెడ్ కానిస్టేబుల్ మురళిని సత్కరిస్తున్న తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వర్తించి పోలీస్ శాఖ ప్రతిష్టను ఇనుమడింపజేయాలని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా సాయుధ బలగాలకు 12 రోజుల పాటు నిర్వహించిన యాన్యువల్ మొబిలైజేషన్ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. నగరంలోని పోలీస్ కవాతు మైదానంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. బ్యాండ్ పార్టీ వాయిద్యాల నడుమ సాగిన సాయుధ బలగాల కవాతును వీక్షించి వారి నుంచి గౌరవవందనాన్ని స్వీకరించిన అనంతరం ఎస్పీ మాట్లాడారు. సాధారణ బందోబస్తు నుంచి శాంతి భద్రతల పరిరక్షణ విధుల్లో ఏఆర్ సిబ్బంది పాత్ర కీలకమని చెప్పారు. మానసిక, శారీరక దృఢత్వం.. వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకుంటూ విధులు నిర్వర్తించాలని సూచించారు. సిబ్బంది తమ సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారిస్తామని భరోసా ఇచ్చారు. రానున్న ఎన్నికలు, సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కవాతును అద్భుతంగా నిర్వహించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. యోగాలో శిక్షణ ఇచ్చిన హెడ్ కానిస్టేబుల్ మురళిని సత్కరించారు. ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాసరావు, ఏఎస్పీలు సౌజన్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

షాపులే లక్ష్యంగా దొంగల హల్‌చల్

నెల్లూరు(క్రైమ్): నగర, రూరల్ ప్రాంతాల్లో షాపులనే లక్ష్యంగా చేసుకొని శుక్రవారం తెల్లవారుజామున దొంగలు హల్‌చల్ చేశారు. వేదాయపాళెంలోని ఓ సూపర్ మార్కెట్ షట్టర్లను తెరిచి అందులో ఉన్న సుమారు రూ.60 వేలకుపైగా నగదును దోచుకెళ్లారు. సమీపంలోని పలు దుకాణాల షట్టర్లను తెరిచి చిల్లర నగదును అపహరించారని సమాచారం.

- బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మినీబైపాస్‌లో గల ఓ వస్త్ర దుకాణ షట్టర్లను తెరిచి అందులో ఉన్న రూ.35 వేల నగదు, కళ్లజోళ్లను అపహరించుకెళ్లారు.
- నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కల్లూరుపల్లిలో గల ఓ దుకాణంలోనూ ఇదే తరహాలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. సీసీ ఫుటేజీల్లో ఆనవాళ్లు దొరక్కుండా ఉండేందుకు దుకాణాల్లోని డిజిటల్ వీడియో రికార్డర్లను అపహరించుకెళ్లారు. చోరీ జరిగిన ప్రాంతాలను ఆయా ప్రాంత పోలీస్ అధికారులు పరిశీలించారు. ఘటన స్థలంలో వేలిముద్రలను క్లూస్‌టీమ్ సేకరించింది. చోరీలు జరిగిన తీరును బట్టి దుండగులు ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వారై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

వ్యాధి నిరోధక టీకాలను తప్పక ఇవ్వాలి



మాట్లాడుతున్న పెంచలయ్య

నెల్లూరు సిటీ: వ్యాధి నిరోధక టీకాలను క్రమం తప్పకుండా ఇవ్వాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పేర్కొన్నారు. కావలి, కందుకూరు డివిజన్లలోని ప్రోగ్రామ్ అధికారులు, వైద్యాధికారులు, ఆరోగ్య పర్యవేక్షణాధికారులతో నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి మూడున నిర్వహించనున్న పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమానికి సన్నద్ధమై ప్రణాళికలను రూపొందించుకోవాలని సూచించారు. నూరు శాతం లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. వ్యాధి నిరోధక టీకాలను కూలింగ్ ప్రాంతాల్లో భద్రపర్చాలన్నారు. డాక్టర్లు ఖాదర్‌వలీ, సెలీనాకుమారి, మౌనికా, దయాకర్, ప్రియంవద తదితరులు పాల్గొన్నారు.

నిమ్మధరలు పొదలకూరు (కిలో)	
పెద్దవి	: రూ. 60
సన్నవి	: రూ. 50
పండ్లు	: రూ. 25



చురుగ్గా పిల్లర్ల నిర్మాణం



మోటార్ల ద్వారా నీటి తొలగింపు

వంతెన పనులు రయ్.. రయ్

నగరంలోని పెన్నా బ్రిడ్జిపై రాకపోకలు రోజురోజుకూ అధికమవుతున్న తరుణంలో మూడో వంతెన పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం భారీ యంత్రాలను నెలకొల్పి పిల్లర్లను ఏర్పాటు చేస్తున్నారు. దుమ్మూ, ధూళి కారణంగా రాకపోకలు సాగించే వారు ఇబ్బంది పడకుండా పట్టలను ఏర్పాటు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

డ్రోన్ల సాంకేతికతపై అవగాహన



కోవూరు: నూతన సాంకేతిక పద్ధతులపై ప్రాథమిక దశ నుంచే విద్యార్థులు దృష్టి సారించాలని ప్రధానోపాధ్యాయుడు నరసింహమూర్తి పేర్కొన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో భాగంగా పట్టణంలోని పచ్చిపాల రామనాథమ్మ జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో డ్రోన్ల సాంకేతికతపై 8, 9వ తరగతుల విద్యార్థులకు అవగాహన సదస్సును టెక్కీబాట్ సహకారంతో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ తదితరాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. డ్రోన్ల వినియోగం అన్ని రంగాల్లో విస్తరిస్తోందని చెప్పారు. డ్రోన్ల తయారీ, వాటిని ఏ విధంగా ఉపయోగించాలనే అంశాలపై టెక్కీబాట్ శిక్షకులు వేణుకుమార్, కార్తీక్ అవగాహన కల్పించారు. సైన్స్ ఉపాధ్యాయులు భారతి, శైలజ, రాజేశ్వరి, ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము దేవదాయ ధర్మదాయ శాఖ
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా.

టెండర్ ప్రకటన

శ్రీ రామ మందిరం - విరువూరు గ్రామము,
పొదలకూరు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

పై దేవస్థానము పునః నిర్మాణము చేయుటకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలిచి వున్నారు. ఆసక్తి కలిగిన వారు క్రింది వెబ్‌సైటు నందు టెండరు వివరములు కొరకు చూడవచ్చును.

వెబ్‌సైటు అడ్రసు : https://tender.apeprocurement.gov.in// అను వెబ్‌సైటు నందు టెండర్ వివరములు చూడవచ్చును.

ఇట్లు : **ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్**

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 120
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	: 216
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 242
లేయర్ చికెన్	: 145

పుస్తక పఠనంపై దృష్టి సారించాలి



పుస్తక వితరణ కార్యక్రమంలో దాతలు తదితరులు

కోవూరు: పుస్తక పఠనంపై దృష్టి సారించడం ద్వారా విద్యార్థుల మేధస్సు మరింత మెరుగవుతుందని సర్వశిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని పడుగుపాడు పంచాయతీ నేతాజీనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లైబ్రరీకి రూ.50 వేల విలువజేసే పుస్తకాలను ఎన్నారై వాసవీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అందజేశారు. ఉపాధ్యాయుడు కోదండరామయ్య, సీఆర్పీ హరీష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ మృతి

నెల్లూరు(క్రైమ్): ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ శుక్రవారం మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. ఇసుక డొంకకు చెందిన రాజ్యలక్ష్మి (44) అంగన్‌వాడీ హెల్పర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈమె భర్త శ్రీనివాసులు కొంతకాలం క్రితం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె చికిత్స పొందుతున్నారు. అయినా ఆరోగ్యం కుదుటపడకపోవడంతో మనస్తాపానికి గురై ఎలుకల మందును గురువారం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మందు పనిచేయకపోవడంతో తిరిగి ఇంట్లో ఉరేసుకున్నారు. విషయాన్ని గమనించిన కుమార్తె మౌనిక స్థానికుల సాయంతో ఆమెను చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు. ఈ మేరకు సంతపేట పోలీసులకు మృతురాలి కుమార్తె ఫిర్యాదు చేశారు. ఎస్సై కిరణ్ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు.